సాక్షి హనుమకొండ

శుక్రవారం | 5 | జూలై | 2024



ఆస్కార్ గ్రంథాలయం.. దేవాలయం

ఆస్కార్ గ్రంథాలయం.. ఒక దేవాలయమని, దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. - 8లో▸



అసైదులా హోరతి..

త్యాగం.. శాంతికి ప్రతీక మొహరం. ప్రజాస్వామ్యం.. మానవ హక్కుల పరిరక్షణ కోసం 14 శతాబ్దాల క్రితమే జరిగిన చారిత్రాత్మక పోరాటమే మొహరం. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33° /26°

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

న్యూస్‌రీల్

వరంగల్-1 డిపోకు 50 ఏళ్లు



హన్మకొండ: ఆర్టీసీ వరంగల్-1 డిపో స్థాపించి 50 ఏళ్లు పూర్తయింది.. ఈ సందర్భంగా గురువారం హనుమకొండలోని డిపోలో ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను ఆధ్వర్యాన కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆర్ఎం మాట్లాడుతూ సంస్థకు ఆదాయం సమకూర్చడంలో వరంగల్-1 డిపో ప్రధాన పాత్ర పోషిస్తున్నదని చెప్పారు. డిప్యూటీ ఆర్ఎం కేశరాజు భానుకిరణ్, అసిస్టెంట్ ఇంజనీర్ టి.శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ షూటర్‌కు సీపీ అభినందన



వరంగల్ క్రైం: ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళా ఓపెన్ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన సుబేదారి పోలీస్‌స్టేషన్ మహిళా ఏఎస్సై వి.సువర్ణను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. సువర్ణ గత నెల 21 నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ మాస్టర్స్ విభాగంలో 579 పాయింట్లు సాధించి బంగారు పతకం అందుకున్నారు. గత నెల 15 నుంచి తమిళనాడులో జరిగిన ఆలిండియా పోలీస్ స్పెషల్ మహిళా షూటింగ్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొని 5వ స్థానంలో నిలిచారు. సువర్ణకు సీపీ గురువారం అభినందనలు తెలిపారు. ఆర్ఐ స్వర్ణరాజ్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశ దరఖాస్తుల గడువు పొడిగింపు

కాజీపేట: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా చేసుకునే దరఖాస్తు గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు జనగామ జిల్లా కన్వీనర్, కాజీపేట ఐటీఐ ప్రిన్సిపాల్ కె.అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. www.iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలన్నారు.

నిట్‌లో కాన్ఫరెన్స్ ప్రారంభం



కాజీపేట అర్బన్: 'నిట్' వరంగల్ అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో గురువారం 'ఈమర్జింగ్ మల్టీ ఫంక్షనల్ మెటీరియల్స్ అండ్ డివైజెస్ ఫర్ సస్టేయినబుల్ టెక్నాలజీస్(ఐఈఎండీఎస్టీ)-24' అనే అంశంపై రెండు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభమైంది. నిట్ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కాన్ఫరెన్స్‌ను ఏఆర్‌సీఐ హైదరాబాద్ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ నరసింహారావు, న్యూఢిల్లీ మిలియా ఇస్లామియా యూనివర్సిటీ ప్రొఫెసర్ తోకిర్ అహ్మద్, నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ ప్రారంభించి సావనీర్ విడుదల చేశారు.

రేపటి నుంచి భద్రకాళి నవరాత్రి మహోత్సవాలు



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవస్థానంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆలయ కార్య నిర్వహణాధికారి శేషుభారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో.. ఈనెల 6 నుంచి 21 వరకు భద్రకాళి శాకంబరీ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. వరంగల్ నగర పర్యటనలో ఉన్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కొండా సురేఖను గురువారం ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రుల చేతుల మీదుగా అమ్మవారి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంత్రులు శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖకు వేర్వేరుగా ఉత్సవాల ఆహ్వాన పత్రికతోపాటు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈనెల 21న శాకంబరీ రూపంలో దర్శనం ఇవ్వనున్న అమ్మవారిని దర్శించుకోవాలని మంత్రులను కోరినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, సూపరింటెండెంట్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



దోమలు చావవు.. పీడీ ఆగదు!

గ్రేటర్‌లో అడ్రస్ లేని ఫాగింగ్

- పక్కదారి పడుతున్న డీజిల్, పెట్రోల్
- కరువైన పిచికారీ, ఆయిల్ బాల్స్, రసాయనాలు
- ఆస్పత్రుల పాలవుతున్న నగరవాసులు

చేయాల్సింది ఇది..

అర్బన్ మలేరియా విభాగానికి చెందిన కార్మికుడు రోజుకు 300 ఇళ్లు తిరగాలి. ఇంటి పరిసరాల్లో దోమల వృద్ధికి కారణమయ్యే ప్రాంతాల్లో నివారణ మందులు చల్లాలి. అందుకు సాక్ష్యంగా కాలనీవాసులతో సంతకాలు తీసుకోవాలి. ఆ వివరాలను సంబంధిత విభాగానికి అందజేయాలి.

చేస్తున్నది ఇదీ..

తెల్లవారగానే రోజూ హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు, హెల్త్ అసిస్టెంట్లకు ముఖం చూపించి వెళ్తున్నారు. సాయంత్రం వేళల్లో ఫాగింగ్ పేరుతో డీజిల్, పెట్రోల్ కూపన్లు స్వీకరిస్తున్నారు. నామమాత్రంగా ఫాగింగ్ చేసి ఇంటి ముఖం పడుతున్నారు. 70శాతానికిపైగా డీజిల్, పెట్రోల్ బ్లాక్‌లో అమ్మేస్తున్నారు.

వరంగల్ అర్బన్: దోమలు బాబోయ్ దోమలు.. కుర్చోనివ్వవు.. నిలబడనివ్వవు.. పడుకోనివ్వవు.. పగలు, రాత్రీ తేడా లేదు. పగబట్టినట్లుగా దాడి చేస్తున్నాయి. దోమకాటు కారణంగా వరంగల్ మహానగర ప్రజలు వ్యయ, ప్రయాసలకు గురవుతున్నారు. దోమ కాటుకు గురైన చాలా మంది జ్వర పీడితులుగా ఆస్పత్రుల్లో చేరుతున్నారు.

ఖాళీ స్థలాలు.. కంపుకొడుతున్న కాల్వలు

ఇటీవల కురిసిన వర్షాలతో కాలనీల్లోని ప్రైవేట్ ఖాళీ స్థలాలు.. చెరువులు, కుంటల్ని తలపిస్తున్నాయి. రోజుల తరబడి నీళ్లు నిల్వ ఉండడం కారణంగా లార్వా పుట్టుకొచ్చి దోమల బెడద ఎక్కువైంది. నగరంలో 4వేలకు పైచిలుకు నివాసాల నడుమ ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. వాటిలో తుమ్మచెట్లు, ఇతర పిచ్చిమొక్కలు, వ్యర్థాలు పేరుకుపోయాయి. అయా ప్లాట్లను శుభ్రం చేసి జరిమానాలు విధించి ఓనర్ల నుంచి వసూలు చేసే అధికారం బల్దియా అధికారులకు ఉంది. అయినా.. ప్రజారోగ్య విభాగం సిబ్బంది మనకెందుకు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇంటింటా రోజూ చెత్త సేకరణ జరగట్లేదు. స్వచ్ఛ ఆటోలు, పారిశుద్ధ్య కార్మికులు.. ఇళ్లల్లో పోగైన చెత్తను 40 శాతం మేరకు తీసుకెళ్లడం లేదు. కాలనీవాసులు ఆ చెత్తను డ్రెయినేజీలు, ఖాళీ స్థలాల్లో పడేయడంతో మురుగు కంపుతో దోమలకు అవాసాలుగా మారుతున్నాయి.

అందరూ అందరే..

అర్బన్ మలేరియా విభాగంలో అందరిదీ ఒకే తీరు. 'సిబ్బంది తక్కువగా ఉన్నాం. కేటాయించే డీజిల్, పెట్రోల్, ఇతర రసాయనాలు తక్కువే. మనం ఏం చేసినా దోమలు చావవు. ఫాగింగ్ లార్వా, స్పెషల్ డ్రైవ్‌లు అందరికీ తెలుసు. ఇక మనం చేసేదేముంది' అనుకుంటూ విధి నిర్వహణను తప్పించుకుని తిరుగుతున్నారు. ఒకవేళ ఎవరైనా అడిగితే ఆరోజు పని చేస్తారు. దీంతో అర్బన్ మలేరియా విభాగం సిబ్బంది, అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దోమల నివారణ పేరిట కార్మికుల వేతనాలు, రసాయనాలు, ఫాగింగ్ తదితరాలకు సుమారు నెలకు రూ.2కోట్లకుపైగా వెచ్చిస్తున్నప్పటికీ నగర ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. క్షేత్ర స్థాయి కాలనీల్లో పక్షం రోజులకోసారి ఫాగింగ్ చేయట్లేదు. పర్యవేక్షణ అసలే లేకుండా పోయింది. దీంతో డీజిల్, పెట్రోల్ పక్కదారి పడుతోంది. ఈవిషయంపై బల్దియా ఉన్నత అధికారులు వాస్తవాలను గ్రహించకుండా.. పట్టింపులేని దోరణితో వ్యవహరిస్తున్నారు. యంత్రాలు మరమ్మతుల పాలయ్యాయని చేతులెత్తేస్తున్నారు. తద్వారా జీడబ్ల్యూఎంసీ ఖజానాకు ఏటా రూ.కోట్ల సొమ్ముకు గండిపడుతోంది. వేలాది మంది ప్రజలు డెంగీ, మలేరియా, జ్వరాల బారిన పడుతున్నారు. దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్, ఇద్దరు కలెక్టర్లను నగర వాసులు కోరుతున్నారు.



వరంగల్ నాగేంద్రనగర్ ప్రాంతంలో ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగు నీరు



వరంగల్ జన్మభూమి జంక్షన్ సమీపాన ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన చెత్త

కంటి మీద కునుకు ఉండట్లే..



మాది లోతట్టు ప్రాంతం. వారానికోసారి కాల్వలు తీస్తారు. ఫాగింగ్ నెలకోసారి కూడా చేయట్లేదు. దోమలతో నిత్యం నరకం అనుభవిస్తున్నాం. కంటిమీద కునుకు ఉండడం లేదు.

- ఇండ్ల రవి, హనుమాన్ నగర్

ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్నారు



ఖాళీ స్థలం కనిపిస్తే చాలు చెత్త డంప్ చేస్తున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా దోమలు కుడుతున్నాయి. శాకరాశికుంట ప్రధాన నాలాలో చెత్తాచెదారం పేరుకుపోయింది. చెత్త డంప్ చేయకుండా చర్యలు తీసుకోవాలి.

- దొంతి సురేందర్‌రెడ్డి, వ్యాపారి

దోమల్ని నివారించాలి..



దోమల బెడద విపరీతంగా ఉంది. రాత్రయితే చాలు ఇళ్లల్లోకి చేరి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. దోమలు వృద్ధి చెందకుండా కార్పొరేషన్ అధికారులు గతంలో మాదిరిగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి.

- పాలకుర్తి జగన్, గిర్మాజీపేట

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు



'లీకేజీ'లను నిరసిస్తూ ఆందోళన

విద్యారణ్యపురి: దేశవ్యాప్తంగా మెడిసిన్‌లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పేపర్ లీకేజీతో నష్టపోతున్న విద్యార్థులకు న్యాయం చేయాలని లేకపోతే పార్లమెంట్‌ను ముట్టడిస్తామని వివిధ విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ బాధ్యులు హెచ్చరించారు. నీట్, యూజీసీ నెట్ పేపర్ల లీకేజీలను నిరసిస్తూ.. గురువారం దేశవ్యాప్తంగా తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌లో భాగంగా హనుమకొండలోని వివిధ విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కేయూ క్రాస్ రోడ్ నుంచి ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, యూఎస్ఎఫ్ఐ బాధ్యులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ హనుమకొండలోని అశోకా జంక్షన్ వరకు కొనసాగింది. అక్కడ రాస్తారోకో చేపట్టారు. నిరసన కార్యక్రమంలో ఆయా సంఘాల ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యులు భాషబోయిన సంతోశ్, పల్లకొండ సతీశ్, బి.నర్సింహారావు, మంద శ్రీకాంత్, రాచకొండ రంజిత్, మాలవత్ రాజేశ్, భాషబోయిన వేణురాజ్, ఉట్కూరి ప్రణీత్‌గౌడ్, కుమార్, వేల్పుల చరణ్, కసరబోయిన రవితేజ, మాచర్ల రాజుగౌడ్, శ్రీపతి వినయ్, మహేశ్, గణేశ్, చరణ్, వంశీ, బాలగోని రాకేశ్ జస్వంత్ పాల్గొన్నారు. విద్యాసంస్థల బంద్ పిలుపుతో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ముందుగానే సమాచారం ఇవ్వడంతో విద్యార్థులెవరూ పాఠశాలలకు వెళ్లలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం కొందరు విద్యార్థులు హాజరుకాగా తరగతులు జరుగుతుండగా.. అక్కడక్కడా ఆయా సంఘాల బాధ్యులు తిరుగుతూ బంద్ చేయించారు.

'ప్రజాపాలన' పేరుతో ప్రతీకార చర్యలు

- బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీకార చర్యలు సాగిస్తోందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలు అమలు చేయలేక చతికిల పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ కార్యాలయాల కూల్చివేతకు కుట్రలు పన్నుతున్నారని, రాష్ట్రంలో ఇతర పార్టీలకు కేటాయించిన విధంగానే రూ.4.84 లక్షలు కట్టించుకుని హనుమకొండలో పార్టీ కార్యాలయానికి ప్రభుత్వం స్థలం కేటాయించినట్లు పేర్కొన్నారు. పార్టీ అవసరాలకు మాత్రమే ఈ స్థలాన్ని వాడుకుంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా నోటీసు జారీ చేశారని, ఆధారాలతో వివరణ ఇచ్చామని చెప్పారు. హనుమకొండ నడిబొడ్డున కాంగ్రెస్ కార్యాలయానికి కేటాయించిన స్థలం కూడా మున్సిపల్ పార్కుకు చెందినదేనని, పార్టీ కార్యకలాపాలకు కాకుండా బ్యాంక్‌కు అద్దెకు ఇచ్చి వ్యాపారానికి వినియోగిస్తున్నదని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నిలదీస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, శ్రేణులపై అక్రమ కేసులు పెడుతున్నారని, తమ జోలికి వస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యాలయాలను ముట్టుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యాలయాలను కూల్చుతామని హెచ్చరించారు. సమావేశంలో నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, పులి రజనీకాంత్, చెన్నం మధు, బోయిన్‌పల్లి రంజిత్‌రావు, నల్ల స్వరూపారాణి, ఇమ్మడి లోహితరాజు, జానకీరాములు, నయీమొద్దీన్, ఉడుతల సారంగపాణి పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు


రామన్నపేట/హన్మకొండ : వరంగల్‌ను రాష్ట్రంలోనే నంబర్ వన్ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం ములుగు రోడ్డులోని లాల్‌బహదూర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొనడంతో పాటు హనుమకొండ ఇందిరానగర్‌లో స్థాపించిన రాక్స్ ఐటీ సొల్యూషన్స్‌ను ప్రారంభించిన మంత్రి.. హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్‌లోని కాకతీయ ఐటీ పార్కును సందర్శించారు. ఎల్‌బీ కళాశాలలో ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ చదివిన అనేక మంది ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని, వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తున్న ఈ కళాశాల స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్బీ కళాశాలను స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎంపిక చేస్తామని, విద్యార్థులు లక్ష్యంతో చదివి జిల్లా, రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తేవాలని కోరారు. అంతకుముందు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ఎన్‌సీసీ కేడెట్స్ గౌరవ వందనం స్వీకరించి లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలి..

విదేశాల్లో ఉన్న తెలంగాణ ప్రాంత వాసులంతా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి వ్యాపార సంస్థలను ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. రాక్స్ ఐటీ సొల్యూషన్స్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. వరంగల్ నగరం విజ్ఞానానికి నిలయమని, ఇక్కడి మానవ వనరులు ఇతర ప్రదేశాలకు వెళ్లకుండా పుట్టిన ప్రదేశంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించాలనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అందులో భాగంగానే వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ వంటి నగరాల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ, వరంగల్‌లో సాఫ్ట్‌వేర్ రంగానికి పరిమితం కాకుండా టెక్స్‌టైల్ పరిశ్రమలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చెప్పారని, త్వరలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించిన పాలసీని ప్రభుత్వం తీసుకొస్తుందని చెప్పారు. టీజీపీఎస్‌సీ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చి ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని వివరించారు. వరంగల్ విమానాశ్రయాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కళాశాల చైర్మన్ నిరంజన్, కరస్పాండెంట్ రాజేంద్ర కుమార్, బాధ్యులు రమేశ్, ఆనంద్‌కుమార్, ప్రిన్సిపాల్ డీహెచ్.అరుణ, తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ అడ్వయిజర్ ఇ.వి.శ్రీనివాస్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాక్స్ ఐటీ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు రావుల రంజిత్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యత తీరిపోయిందని భావించొద్దు..

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఎల్కతుర్తి: ప్రజాప్రతినిధులు పదవీకాలం ముగిసిందనీ.. బాధ్యత తీరిపోయిందని భావించకుండా ప్రజాసేవలో నిత్యం తమ భాగస్వామ్యాన్ని అందించాలి.. రాజకీయ భవిష్యత్‌లో మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆకాంక్షించారు. ఎంపీపీ, ఎంపీటీసీల పదవీ కాలం గురువారంతో ముగిసిన సందర్భంగా భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రాజకీయ పరంగా రిటైర్మెంట్ ఉండదని, ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని రాజకీయ ఉన్నత స్థాయి పదవులు పొందాలని ఆకాంక్షించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు లేరనే లోటు కనిపించకుండా అధికారులు సమన్వయంతో అభివృద్ధిలో ముందుకు సాగాలని సూచించారు. గౌరవెల్లి, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసి రైతు వేదిక ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. ఎంపీడీఓలు విజయ్‌కుమార్, వీరేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీలు మేకల స్వప్న, జక్కుల అనిత, వైస్ ఎంపీపీలు తంగెడ నగేశ్, ఎర్రా, జెడ్పీటీసీ వంగ రవీందర్, తహసీల్దార్లు జగత్‌సింగ్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

సీఎం హామీలకు త్వరలో మోక్షం..

నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- కీలకంగా ఎనిమిది అంశాలు..
- యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు
- వీలైనంత త్వరగా 2050- మాస్టర్ ప్లాన్
- మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష



హైదరాబాద్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో హాజరైన జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

సాక్షి ప్రతినిధి, వరంగల్:

గ్రేటర్ వరంగల్ మహానగరంలో ఇటీవల పర్యటన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల మేరకు నగర సమగ్రాభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ముఖ్యంగా ఎనిమిది అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖలు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులతో హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. వరంగల్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం అనేక హామీలు ఇచ్చారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యాలను దృష్టిలో పెట్టుకుని నగరాభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఆరు గంటలకు పైగా సమీక్ష..

వరంగల్ నగర అభివృద్ధే లక్ష్యంగా సచివాలయంలోని తన కార్యాలయంలో వరంగల్ జిల్లా మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ(సీతక్క), సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి ఆరు గంటలకుపైగా సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి, ఐఆర్ఆర్ భూసేకరణ, ఓఆర్ఆర్ అలైన్మెంట్, వరంగల్ మాస్టర్‌ప్లాన్, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ, 'కుడా' మాస్టర్ ప్లాన్, కాళోజీ కళాక్షేత్రం, జీడబ్ల్యూఎంసీ పరిధిలో రిటైనింగ్ వాల్ నిర్మాణం, వరద నివారణ చర్యలు, ఇంకుడు గుంతల నిర్మాణం, నర్సంపేట మెడికల్ కాలేజీ తదితర అంశాలపై చర్చించారు.

వరద ముప్పు ఉండొద్దు..

వరంగల్ నగరానికి భవిష్యత్‌లో వరద ముప్పు ఉండొద్దు.. వరద నీరు సాఫీగా వెళ్లడానికి నాలాలను విస్తరించాలి.. ఇందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పేర్కొన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్)ను బలోపేతం చేయడానికి అవసరమైన సిబ్బందిని రెవెన్యూ శాఖ నుంచి సమకూరుస్తామని చెప్పారు. నాలాలు, చెరువులు ఆక్రమణకు గురికావడం వల్లే తరచూ వరంగల్ నగరం వరద ముంపునకు గురవుతోందని, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలాలు ఆక్రమించుకుని నివాసముంటున్న వారిని మరో ప్రాంతానికి తరలించాలని, వారికి ఇబ్బంది కలగకుండా ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సూచించారు. కొత్తగా నాలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందేలా డాక్టర్లను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వసతులు మెరుగుపరచాలని వైద్య అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. సమావేశంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కె.నాగరాజు, కడియం శ్రీహరి, శాసనమండలి సభ్యులు బండా ప్రకాశ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ కార్యదర్శి దాన కిశోర్, ఆర్అండ్‌బీ శాఖ కార్యదర్శి హరిచందన, సీడీఎంఏ వీపీ.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారదాదేవి, పి.ప్రావీణ్య, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు.

మెడికల్ హబ్‌గా ఓరుగల్లు..

ఓరుగల్లు త్వరలోనే మెడికల్ హబ్‌గా మారబోతున్నది.. నర్సంపేటలోని మెడికల్ కాలేజీ కార్యకలాపాలు ఈ ఏడాది నుంచి ప్రారంభించడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూని మంత్రి పొంగులేటి ఆదేశించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. కాజీపేట అయోధ్యపురం ఆర్ఓబీ నిర్మాణ పనుల ఆలస్యానికి ఆర్ అండ్ బీ అధికారులపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏళ్లు గడిచినా ఇంకా డ్రాయింగ్‌ల దగ్గరే ఉండడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

హైదరాబాద్‌కు దీటుగా..

సమీక్షలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్ మహానగరాన్ని హైదరాబాద్ కు దీటుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. 2050 వరకు జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రజల అవసరాలకు సరిపోయేలా మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్లాన్‌లో ఫార్మా సిటీ, ఐటీ సర్వీసెస్, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్, ఎకో టూరిజం, ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, స్టేడియం, ఎయిర్ పోర్ట్, లాజిస్టిక్స్ పార్క్, టూరిజం, ఖమ్మం-వరంగల్, కరీంనగర్-వరంగల్ రహదారుల్లో డంపింగ్ యార్డుల ఏర్పాటు వంటి అంశాలు ప్రధానంగా ఉండేలా ప్లాన్ త్వరగా తయారుచేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేయాలని సూచించారు. వరంగల్ నగరంలో నిర్మించే రింగ్ రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా చూడాలని, ఈ ప్రాజెక్టుకు భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని చెప్పారు. సెప్టెంబర్ 9న కాళోజీ జయంతి సందర్భంగా కాళోజీ కళాక్షేత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని, అప్పటివరకు పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని మంత్రి హెచ్చరించారు.

క్లుప్తంగా

నేడు బాధ్యతల స్వీకరణ



హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య



వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి

వరంగల్: జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాల కలెక్టర్లకే ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు అప్పగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు హనుమకొండ జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ జిల్లా పరిషత్ ప్రత్యేక అధి కారిగా కలెక్టర్ సత్యశారదాదేవి శుక్రవారం బాధ్యతలు చేపడుతున్నట్లు జెడ్పీ అధికారులు తెలిపారు.

ముగిసిన స్పోర్ట్స్ హాస్టల్ ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రాంతీయ వసతి గృహ ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్ క్రీడలలో నిర్వహించిన ఎంపిక పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించిందని హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జిమ్, మెడిసిన్ బాల్‌త్రో, 800 మీటర్ల పరుగుపందెం, బ్యాటరీ టెస్టులు నిర్వహించామన్నారు. క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా పాయింట్లు కేటాయించి తుది జాబితా 'శాట్'కు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచ్‌ల బృందం ఆధ్వర్యాన నిర్వహించిన ఎంపికల్లో డీఎస్‌ఏ కోచ్‌లు, క్రీడా సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇన్‌స్పైర్‌పై అవగాహన సదస్సు

కాశిబుగ్గ సెంటర్: రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, గైడ్ టీచర్లు, విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డుల నామినేషన్ ప్రక్రియపై శనివారం ఉదయం నుంచి 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అవగాహన కల్పించనున్నారు. విషయ నిపుణులతో కూడిన ప్యానల్ బృందం టీ–శాట్ (నిపుణ చానల్) ద్వారా అవగాహన కల్పించనున్నట్లు డీఈఓ డి.వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని తప్పకుండా వీక్షించాలని ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

అసైదులా హోరతి..



పీరీల ఊరేగింపు(ఫైల్)

- 17న మొహర్రం
- పీరీల ముస్తాబు

కాజీపేట : త్యాగం.. శాంతికి ప్రతీక మొహర్రం. ప్రజాస్వామ్యం.. మానవ హక్కుల పరిరక్షణ కోసం 14 శతాబ్దాల క్రితమే జరిగిన చారిత్రాత్మక పోరాటమే మొహర్రం. స్థానికంగా పీరీల పండుగ అంటున్నా మొహర్రం పండుగ కాదు. కర్బలా మైదానంలో జరిగిన యుద్ధంలో మృతి చెందిన వారి జ్ఞాపకార్థం శోక (సంతాప) దినాలుగా ఆచరిస్తారు. మొహర్రంలోని పది రోజులు విషాదదినాలే. ముస్లింలే కాకుండా ముస్లిమేతరులూ సమభావం, సామరస్యంతో కార్యక్రమాల్లో పాలు పంచుకుంటారు. కాగా, మొహర్రం మాసం ఆరంభం నుంచి ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇమామ్ హుస్సేన్ వీరమరణానికి నిదర్శనంగా చావిడి (మఖానం)లో పీరీలను కూర్చోబెట్టి పది రోజులపాటు ప్రార్థనలు చేస్తారు. కుల, మతాలకతీతంగా అందరూ పాల్గొని పీరీల వద్ద ప్రత్యేక పూజలు, చదివింపులు (ఫాతేహాలు) జరపడం విశేషం. మత సామరస్యతకు ఇది గొప్ప నిదర్శనంగా చెప్పొచ్చు. 10వ రోజు తెల్లవారుజామున 3.30 గంటలకు అగ్నిగుండంలోకి పీరీలు ప్రవేశించి ఊరంతా గ్రామోత్సవం జరుపుకుంటాయి. ఇస్లామియా భాషలో 'అషురా' అంటారు. ప్రాణత్యాగం చేసిన ఉదంతాన్ని షహదత్‌గా (ఈనెల 17న మొహర్రం) నిండు శోకంతో జరుపుతారు. ఊరేగింపు సమయంలో పీరీలను ప్రతి ఇంటి ముందు ఆపుతారు. ఆ సమయంలో ఇంటివారు బిందెలతో నీటిని తెచ్చి పీరీలను ఎత్తుకున్న వారి పాదాలను శుభ్రం చేసి పాద నమస్కారాలు చేసుకుంటారు. కులమతాలకతీతంగా భక్తి ప్రవత్తులను చాటుకుంటారు. అదేరోజు సాయంత్రం పీరీలను చావిడి నుంచి తీసుకుని గ్రామ శివారులోని పొలిమేర వరకు తీసుకెళ్లి వాటిని శుభ్రం చేసి మళ్లీ చావిడికి తీసుకొస్తారు. అప్పుడు మొహర్రం పూర్తవుతుంది.

17న మొహర్రం.. బీబీకా ఆలం

17వ తేదీ మధ్యాహ్నం నుంచి పీరీలను మరోసారి గ్రామంలో ఊరేగిస్తారు. పీరీలు ఏటీకి పోతుంటే భక్తులంతా బెల్లం, నువ్వులు కలిపిన గట్కాలను చల్లుతుంటారు. గ్రామశివారులోని పోలిమేర వరకు తీసుకెళ్లాక అక్కడ పీరీలను శుభ్రంచేసి ఓ మూట కడుతారు. 'ఆల్‌బిదాయో ఏకుసేని' అంటూ బీబీకా ఆలం పాటను ఆలపిస్తూ పీరీలతో పాటు వాటికి అమర్చిన కర్రలు, దట్టీలను మఖానం వరకు తీసుకువస్తూ రోదిస్తుంటారు.

త్యాగ స్మృతులకు నిదర్శనం



ఇమామ్‌హుస్సేన్ మానవత్వానికి జీవం పోసిన ధీరుడు. ఇరాక్ రాజు యాజిద్ అన్యాయాన్ని ఎదుర్కోవడంలో వీరమరణం పొందారు. ఆయన త్యాగాలను స్మరించుకుంటూ, ధర్మపరిపాలనను మెచ్చుకుంటూ ఏటా మొహర్రం మాసంలో వచ్చే ఈ శోకదినాలను జరుపుకుంటాం. అన్ని మతాల వారు పీరీల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూ సామరస్యతకు ప్రతీకగా నిలుస్తున్నారు.

– అమ్మాబాయి, కాజీపేట

మొక్కుబడులు ఘనంగా...

మేళతాళాలు, డప్పు చప్పుళ్లతో ఇంటికి వచ్చిన పీరీలకు ఆ ఇంటివారు పూలు, కాగితాలతో అందంగా తయారు చేసిన బాసింగాలు, రంగుల దట్టీలు, వెండి, బంగారు గొడుగులు, తొట్టెలు ఇచ్చి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటారు. ఇళ్ల నుంచి పానకం, వడపప్పు, చక్కెర, బెల్లం, ఎండు కొబ్బరిని మఖానం వరకు సపరివారంగా తీసుకొచ్చి సమర్పిస్తారు. వీటిని స్వీకరించిన చావిడి.. (పూజారి) ముతవలి పీరీలను ఎత్తుకున్న వారికి భక్తితో సమర్పిస్తారు.

జియారత్

మొహర్రం అనంతరం మూడురోజులకు జియారత్ నిర్వహిస్తారు.

స్థల కేటాయింపుపై బీఆర్‌ఎస్ నేతల వివరణ

వరంగల్ అర్బన్: హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ నిర్మాణ స్థలం కేటాయింపులు, భవన నిర్మాణం ప్రభుత్వ శాఖ అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఫిర్యాదుతో బల్దియా కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్ గౌడ్ మూడ్రోజుల కాలపరిమితితో నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన బీఆర్‌ఎస్ నాయకులు డిప్యూటీ కమిషనర్‌కు రాతపూర్వకంగా వివరణ అందచేశారు. బాలసముద్రంలోని సర్వే నంబరు 1066లోని ఎకరం స్థలం లేఔట్ ఖాళీ స్థలం. అందులో ఎలాంటి భవన నిర్మాణాలను అనుమతించకూడదు. అప్పడున్న రాజకీయ ఒత్తిళ్ల కారణంగా నిబంధనలకు పట్టించుకోకుండా ఎకరం స్థలం చాలా నామ మాత్రపు ధరకు కేటాయింపులు చేశారు. స్థానిక తహసీల్దార్ ల్యాండ్ పొజిషన్ ఇచ్చిన తర్వాత బల్దియా నుంచి భవన నిర్మాణానికి అనుమతులు తీసుకొని నిర్మించాలి. అవేమీ పట్టించుకోకుండా పొజిషన్ పత్రాలు, ఎలాంటి అనుమతుల్లేకుండానే అనధికారికంగా బీఆర్‌ఎస్ కార్యాలయ భవనాన్ని నిర్మించినట్లు తెలిసింది. బీఆర్‌ఎస్ నేతలు మాత్రం అప్పటి కలెక్టర్ భూకేటాయింపు చేసిన తర్వాతే కార్యాలయాన్ని నిర్మించినట్లు వివరణ ఇచ్చినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఏదేమైనా బీఆర్‌ఎస్ కార్యాలయం రెండు పార్టీల మధ్య కోల్డ్‌వార్‌కు దారి తీసింది. ఈవివరణపై కలెక్టర్, కమిషనర్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులు ఎలా ముందుకెళ్తారోనన్న చర్చ సాగుతోంది. ఈ భూకేటాయింపులు, అనుమతి లేని నిర్మాణం బల్దియా అధికారులకు తలనొప్పిగా మారింది. రాజకీయ ఒత్తిళ్లకు నిబంధనలు విస్మరించారనే భూ కేటాయింపు విషయంలో స్పష్టమవుతోంది.

గంజాయి మత్తులో మైనర్ల హల్‌చల్

- కాశికుంటలో రోడ్డుపై బ్లేడ్స్ చేతబట్టి బెదిరింపులు
- పోలీసుల అదుపులో బాలురు!



కాశికుంటలో వీధిలో మత్తులో హల్ చేస్తున్న మైనర్లు

ఖిలా వరంగల్: గంజాయి మత్తులో మైనర్లు హల్‌చల్ చేశారు. రహదారులపై వెళ్తున్న వారిపై దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. బాలికలు, బాలురు గంజాయి మత్తులో ఊగిపోగా..స్థానికులు వీరి అగడాలను వీడియో తీశారు. గమనించిన మైనర్లు మహిళల మొబైల్ లాక్కొని వీడియోలను తొలిగించి బెదిరించారని స్థానికులు తెలిపారు. ఈఘటన మిల్స్‌కాలనీ పీఎస్‌కు కూత వేటు దూరంలోని కాశికుంటలో జరిగింది. ఈకాలనీలో నిర్జీవ ప్రదేశాలు ఎక్కువగా ఉండటం.. పోలీసు నిఘా అంతంతా మాత్రంగా ఉండడంతో బాలికలు, బాలురు చేరుకుని గంజాయి మత్తులో మునిగి తేలుతున్నట్లు తెలుస్తుంది. రోజు వారీగానే బుధవారం అర్ధరాత్రి ముగ్గురు బాలికలు, ఇద్దరు బాలురు కాశికుంటకు చేరుకుని గంజాయి సేవించారు. మత్తులో రోడ్డుపై చేరి బ్లేడ్స్ చూపుతూ భయభ్రాంతులకు గురిచేశారని స్థానికులు చెబుతున్నారు. అలాగే, మత్తులో ఓ బాలుడు ఇద్దరు బాలికలను పిలిపించి తన వెంట తీసికెళ్లిన విషయం బాలికల తండ్రి తెలిసి అదే రాత్రి మిల్స్‌కాలనీ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా..మొబైల్ లోకేషన్ ఆధారంగా వారి ఆచూకీ కనిపెట్టి బాలుడిని అదుపులోకి తీసుకుని బాలికలను తల్లిదండ్రులకు అప్పగించినట్లు సమాచారం. గంజాయి మత్తులో హల్‌చల్ చేసిన బాలురలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆస్కార్ గ్రంథాలయం.. దేవాలయం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- రూ.36 లక్షలతో నిర్మించిన గ్రంథాలయం ప్రారంభోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: ఆస్కార్ గ్రంథాలయం.. ఒక దేవాలయమని, దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని చల్లగరిగ గ్రామంలో సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కనుకుంట్ల చంద్రబోస్ తన సొంత నిధులు రూ.36 లక్షలతో నిర్మించిన నూతన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు.. చంద్రబోస్ తండ్రి రిటైర్డ్ టీచర్ నర్సయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబోస్ పుట్టిన ఊరి కోసం.. ఇచ్చిన మాట ప్రకారం ఆస్కార్ గ్రంథాలయం నిర్మించారన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో చంద్రబోస్ రాసిన పాటకు ఆస్కార్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంత బిడ్డ ఉన్నత శిఖరాలకు ఎదగడం అభినందనీయమన్నారు. అలాగే గ్రంథాలయానికి ఆస్కార్ పేరు పెట్టడం శుభసూచకమన్నారు. కాగా, ఈ గ్రంథాలయానికి తన వంతుగా రూ. 10లక్షలు కేటాయించనున్నట్లు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యతోనే ప్రతి ఒక్కరూ అభివృద్ధి సాధిస్తారని, ఈ విషయంలో చంద్రబోస్ తన కల నెరవేర్చుకున్నారన్నారు. చంద్రబోస్ కూడా కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నాడు. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో తాన రాసిన పాటకు ఆస్కార్ అవార్డు అభినందనీయమన్నారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

విజ్ఞానవంతులుగా ఎదగాలి..

ఆస్కార్ గ్రంథాలయంలో విద్యార్థులు చక్కగా చదువుకుని విజ్ఞానవంతులుగా ఎదగాలని సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ అన్నారు. తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. చిన్నప్పుడు తాను ఇదే గ్రంథాలయంలో చదువుకున్నానని గుర్తు చేశారు. ఇక్కడే చదువుకుని ఉన్నత చదువు కోసం పట్టణాలకు వెళ్లానని తెలిపారు. ఇటీవల ఆస్కార్ అవార్డు రావడంతో తన సొంత గ్రామానికి వచ్చానన్నారు. ఇంటికి వచ్చిన తాను గ్రంథాలయాన్ని సందర్శించగా శిథిలావస్థలో ఉందన్నారు. దీంతో తన తండ్రి కోరిక మేరకు నూతన గ్రంథాలయ నిర్మాణం చేపట్టాలనుకున్నారన్నారు. ఇందులో భాగంగా గ్రామస్తుల సహకారంతో సొంతంగా రూ.36 లక్షలతో గ్రంథాలయాన్ని నిర్మించానన్నారు. ఈ గ్రంథాలయానికి ఆస్కార్ నామకరణం చేయడం తన పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. విద్యార్థులు, గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌర గ్రంథాలయాల శాఖ సంచాలకుడు ఏవీఎన్ రాజు, జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి శ్రీలత, ఎంపీపీ దావు వినోద, ఎంపీఓ, గ్రామ ప్రత్యేకాధికారి రామకృష్ణ, లైబ్రేరియన్ చంద్రమౌళి, రిటైర్డ్ టీచర్ రాజమౌళి, చంద్రబోస్ స్నేహితులు జేఎన్‌టీయూ ప్రొఫెసర్ బాబురావు, వీరారెడ్డి, ఉపాధ్యాయులు కామిడి సతీష్‌రెడ్డి, సూదం సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కొమురయ్య స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధి

ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహం ఆవిష్కరణ
- పెద్ద ఎత్తున తరలివచ్చిన కురుమ కుల బాంధవులు



దొడ్డి కొమురయ్య విగ్రహం ఆవిష్కరించి పూలమాల వేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, పక్కన విప్ అయిలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

జనగామ: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డు క్లాం కమాన్ వద్ద పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేశారు. గురువారం ఆయన వర్ధంతి సందర్భంగా సంఘం పట్టణ అధ్యక్షుడు బాల్దె మల్లేశం అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాయిరాం ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. 19 ఏళ్ల వయసులోనే తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన వీరుడు కొమురయ్య అన్నారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ.. ఇలా ఎందరో మహానుబావులు జనగామ జిల్లా గడ్డపై జన్మించి పునీతం చేశారన్నారు. ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలో ప్రజలు నలిగిపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ట్యాంకు బండ్‌పై దొడ్డి కొమురయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 3వ తేదీన జరిగే జయంతి రోజున ఆవిష్కరించేలా ముఖ్యమంత్రిని ఒప్పించి, పండగను తలపించేలా వేడుకలు నిర్వహిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, అన్నదాతలతో పాటు ప్రతీ పేదకు సర్కారు నుంచి భరోసా దొరికినప్పుడే దొడ్డి కొమురయ్య ఆశయం నెరవేరుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ విసూ్నరు దొర తల్లి రాణి వెంకటజానమ్మ అరాచకాల నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు రెండు పదులు దాటని వయసులో దొడ్డి కొమురయ్య గడీల పాలనను బద్దలు కొట్టారన్నారు. తెలంగాణ ఆకాంక్షకు ఊపిరిపోసిన సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య రగిలించిన స్ఫూర్తితో ఈ ప్రాంత ప్రజలు నిత్యం చైతన్యంతో పేదల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తుంటారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. దోపిడీ, బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసి అతి చిన్న వయసులో వీర మరణం పొందిన దొడ్డి కొమురయ్య బాటలో నడుస్తూ సమాజహితం కోసం పని చేయాలని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, మాజీ మార్కెట్, మున్సిపల్ చైర్మన్లు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కంచె రాములు, విగ్రహ దాత కడకంచి శ్రీనివాస్, కార్యదర్శి జాయ మల్లేశ్, పట్టణ కార్యదర్శి జూకంటి శ్రీశైలం, కోశాధికారి కేమిడి ఉపేందర్, గౌరవ అధ్యక్షులు మోటె శ్రీశైలం, కర్రె కృష్ణ, ఎండ్రు వైకుంఠం, సంఘ యూత్ జిల్లా అధ్యక్షుడు సేవెల్లి మధు, కౌన్సిలర్ కర్రె శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిద్దాం

- బీసీ వెల్ఫేర్ డీడీ జి.రాంరెడ్డి



మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి

కాజీపేట అర్బన్ : దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిద్దామని బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ జి.రాంరెడ్డి అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా గురువారం హన్మకొండ జిల్లా కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో రాంరెడ్డి పాల్గొని కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొమురయ్యకు ఘన నివాళి

హన్మకొండ అర్బన్ : హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం నాయకులు పాల్గొని దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హనుమకొండ జిల్లా కురమ సంఘం ఉపాధ్యక్షుడు పోతరాజు రమేష్, మల్లెల సిద్దిరాములు, కందారపు సిద్దులు, అమృత కుమారస్వామి, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- **Wanted door to door Marketing** Persons (Male / Female). No Age or Education Limit. Freshers also can apply. Cell: 7997777377. [W-1242497]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/– మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185238]
- ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటి పని/వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663. [H-799899]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అసలేం జరిగింది..!

జూన్ 10న మిత్రుడి పుట్టిన రోజు వేడుకల్లో పార్టీ

- వారం రోజుల తర్వాత ముగ్గురికి అస్వస్థత
- రెండు రోజుల వ్యవధిలో ఇద్దరి మృత్యువాత
- మరొకరి పరిస్థితి విషమం



రామన్నగూడెంలో శ్రావణ్ ఇంటి ఎదుట గుమిగూడిన గ్రామస్తులు



బోగోజు శ్రావణ్(ఫైల్)



ఎస్‌కె.రహీం(ఫైల్)

నర్సింహులపేట: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెం గ్రామానికి ఇద్దరు యువకులు రెండు రోజుల వ్యవధితో మృత్యువాత పడ్డారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన వివరాలు గ్రామస్తుల కథనం ప్రకారం.. జూన్ 10వ తేదీన రామన్నగూడెంలో మిత్రుడి పుట్టిన రోజు వేడుకలకు అదే గ్రామానికి చెందిన బోగోజు శ్రావణ్(25), ఎస్‌కె.రహీం(26), తాడూరి ఉపేంద్రచారితోపాటు మొత్తం పది మంది హాజరయ్యారు. అక్కడ కల్లు, మద్యం సేవించారు. అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారు. వారం రోజుల తరువాత శ్రావణ్, రహీం, ఉపేంద్రాచారి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు మహబూబాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం.. అక్కడి నుంచి హైదరబాద్ యశోద.. తర్వాత నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శ్రావణ్ బుధవారం, రహీం గురువారం మృతి చెందారు. ఉపేంద్రాచారి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. పార్టీలో పది మంది పాల్గొనగా ఈ ముగ్గురికే ఇలా ఎందుకైందనే దానిపై పలు రకాల చర్చజరుగుతోంది. అసలు వారు తాగిన కల్లు ఏమైనా కల్తీ అయిందా.. లేక తీసుకున్న ఆహారంలో ఏమైనా జరిగిందా.. కల్లు తీసిన లొట్టిని ఇంతకు ముందు గడ్డి మందు పిచికారీకి వినియోగించారా.. మరేదైనా కారణం ఉండవచ్చా.. అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కేసు దర్యాప్తు చేస్తున్నాం..

శ్రావణ్ తల్లి జయప్రద వీరి మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసిందని, ఆ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గండ్రాతి సతీశ్ తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టు ఆధారంగా మరణాలకు కారణం తెలుసుకుంటామని పేర్కొన్నారు.

రామన్నగూడెంలో విషాదం..

మృతుడు శ్రావణ్ చిన్న వయసులోనే తండ్రి చనిపోగా తల్లి జయప్రద అన్ని తానై పెంచి పెద్ద చేసింది. చేతికందిన కొడుకు మృతి చెందడంతో తల్లితో పాటుగా వృద్ధులైన నానమ్మ, అమ్మమ్మ దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మరొకరు ఎస్‌కె.రహీం గ్రామంలో కారోబార్‌గా పని చేస్తున్నాడు. పేద కుటుంబం.

టీజీఐఐసీ భూముల ఆక్రమణపై కఠిన చర్యలు

పరిశ్రమల పేరిట పక్కదారి పట్టించే వారి నుంచి అపరాధ రుసుము వసూలు

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- వరంగల్ టీజీఐఐసీ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు

సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) భూములను ఆక్రమణల నుంచి పరిరక్షించుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. సంస్థ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. పరిశ్రమల పేరుతో భూములు పొంది తర్వాత వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిని గుర్తించి అపరాధ రుసం వసూలు చేయాలని చెప్పారు. జిల్లాల వారీగా సంస్థకున్న ఖాళీ భూములను కాపాడేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ కార్యాలయాన్ని గురువారం మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు.

భూములను పక్కదారి పట్టిస్తే చర్యలు

వరంగల్ జిల్లాలో పరిశ్రమలకు రాయితీ ధరపై కేటాయించిన రాంపూర్, మడికొండ పారిశ్రామిక వాడల్లో వాణిజ్య కార్యకలాపాలు జరుగుతుండడంపై మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సర్వే చేసి కమర్షియల్ వినియోగానికి మార్చిన భూములను గుర్తించాలని ఆదేశించారు. కేటాయింపులు పొందిన వారి నుంచి నిబంధనల ప్రకారం రోడ్ల వెడల్పును బట్టి 20 శాతం, 50 శాతం జరిమానా వసూలు చేయాలని సూచించారు. అన్ని జిల్లాల్లో ఐటీ పార్కులు సాఫ్ట్‌వేర్ పరిశ్రమలన్నీ హైదరాబాద్‌లోనే కేంద్రీకృతం కాకుండా.. జిల్లాలకు తరలివెళ్తే భవనాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని శ్రీధర్ బాబు వెల్లడించారు. హనుమకొండలోని కాకతీయ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కును సందర్శించారు. ప్రస్తుతం అందులో ఆరు సాఫ్ట్‌వేర్ కంపెనీలు పనిచేస్తున్నాయని, మరో రెండు నెలల్లో 8 సంస్థలు కార్యకలాపాలు సాగించేందుకు సంప్రదింపులు జరుపుతున్నాయని చెప్పారు. ఐటీ పార్కులో 64 సీట్ల ప్లగ్ అండ్ ప్లే సౌకర్యం ఉండగా సగం సీట్లను సాఫ్ట్‌వేర్, యానిమేషన్ సంస్థలు లీజుకు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్‌ఆర్‌ఐలు, ప్రధాన ఐటీ కంపెనీలు జిల్లాల్లో ప్రాంతీయ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఐటీ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీని వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇది ఆఫీస్ అంటారా?

- అధికారులు ఏం చేస్తున్నారు?
- కొత్త ఫర్నిచర్ ఏర్పాటు చేయండి
- మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలు



కార్యాలయంలోని ఫర్నిచర్‌పై ఉద్యోగితో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

వరంగల్: ఇది ఆఫీస్ అంటారా...ఇంత అధ్వానంగా ఉంటే ఇన్ని రోజులు అధికారులు ఏం చేస్తున్నారని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వరంగల్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీజీఎస్‌ఐఐసీ)జోనల్ కార్యాలయాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. కార్యాలయంలో ఫైళ్లు ఎక్కడ పడితే అక్కడ ఉండడం, ర్యాక్‌లు సరిగా లేకపోవడం, కుర్చీలు సరిగా లేక పోవడంపై జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఆఫీస్ అంతా కలియ తిరిగి ఉద్యోగులను పలకరించారు. ఈసందర్భంగా ఓ ఉద్యోగి కూర్చున్న కుర్చీకి హ్యాండిల్ లేకపోవడం గుర్తించిన మంత్రి.. అమ్మా నీవు ఎప్పటి నుంచి పనిచేస్తున్నావు..కుర్చీకి హ్యాండిల్ లేకుంటే మార్చాలని అధికారులను అడగొద్దా అన్నారు. రాష్ట్ర టీజీఎస్‌ఐఐసీ అధికారులకు ఫోన్ చేసి వెంటనే కార్యాలయంలోని ఫర్నిచర్, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.